# కన్నెమనసు

పడమటి దిక్కున పొద్దువాలగానే, దువ్వెనా సీసా పట్టుకుని తల్లిముందు తయారయింది సీత. నోట్లో నాలుగు మెతుకులు వేసుకొని నట్టింట్లో నడుంవాల్చిన సావిత్రమ్మ మెల్లిగా లేచి కూర్చుంది.

"ఒక్కక్షణం కన్ను మూయనీయవే సీతా! మరీను."

"..............."

"నిద్రలేకో యేమో, తెగమండిపోతున్నాయి కళ్ళు."

"పోనీలే. మరి విసుక్కోకు. నేనే వేసుకుంటాను."

"మాటనేసరికి ముక్కునుంటుంది! ఇలాగయితే రేపు మొగుడితో కాపర మెలా చేస్తుందో?" అని తల్లి సర్ది వేసింది.

మొగుడనగానే సీతకు ఒక్కమ్మడిని సిగ్గుముంచుకొచ్చింది. కంట్లోని పాపని యీ చివరనుండి ఆ చివరకు తిప్పి, అద్దంలో చూసుకుంది.

**కథానిక**

గర్వంతో మనస్సు బిర్ర బిగుసుకుంది.

"అవ్వునే అమ్మా! ఇవాళ నాగరత్నాన్ని చూడ్డానికి పెళ్ళివారొస్తారుట. నిజమేనా?"

"నాకేం తెలుసే అవన్నీనూ. నీకు తెలియాలిగాని."

"అది కాదే. లేకపోతే వాళ్ళ నాన్నగారు పువ్వుల పరికిణీ, జల్తారువాణీ ఎందుకుకొంటారే?"

ఆ విషయమంతా సావిత్రమ్మకు తెలుసు. కాని కూతురు నోటంటే విందామన్న వుద్దేశంతో వూరుకుంది.

జడ చివరవరకూ అల్లి యిటూ, అటూ తల్లి వెదుకుతోంది. తల్లి కళ్ళలోకి ఎర్రగా చూసింది సీత.

ఆ భాష వాళ్ళిద్దరికీ తప్ప యింకెవరికీ తెలీదు. మరేంలేదు. నెల్లాళ్ళకిందట తల్లి నడిగింది రెండు రిబ్బన్లు కొనిపెట్టమని ఇప్పుడు, అప్పుడు అని గడుపుకొస్తోంది సావిత్రమ్మ.

జడ పూర్తికాగానే రేగినజుట్టును దువ్వెనతో సర్దుతూ చెంపల్ని యెగదువ్వింది. సీత చర్రుమన్నాది.

"నా చిట్టితల్లికి కోపమొస్తే ఎంతో బావుంటుంది. ఎలాంటి మొగుడు దొరుకుతాడో ఏమిటో?" అని చంద్రబింబంలాంటి ముఖాన్ని ముచ్చటతో ముద్దుపెట్టుకుంది. 'ఛీ' అని తల్లిని తోసేసింది.

"అయ్యో నాతల్లీ! ఆ మాత్రానికే అసహ్యమంటే, అదే రేపు నీ మొగుడయితే?"

సీత పెరట్లోకి తుర్రున పారిపోయింది.

మొహం తోముకుంటున్నప్పుడు ఎన్నో ఆలోచనలు మెదడులో మెదిలాయి.

నాగరత్నానికి పెళ్ళి. ఇవాళ పెళ్ళివారొస్తారు చూడ్డానికి. పెళ్ళికొడుకు ఏం జేస్తున్నాడో? ఎంత అందగాడో? ఆ...అంతసుందరుడు రావడానికి దీని అందమేమిటో? నల్లగా కోతిలాగ! గర్వం చూడబోతే వుంది వూరంత. ఏం చూసుకునోయేమో? ఇంతా చేస్తే ఎలిమెంట్రీస్కూల్లో మేష్టారిగారి అమ్మాయి. జీతం చాలక ప్రయివేట్లు చెప్పుకుంటారు.

ఘోషా స్త్రీలాగ గది ఒదిలి పైకి వస్తేకదూ?

"ఏమే నాగూ! ఎక్కడా కనిపించడమే మానేశావు" అంటే—

"తీరికేదమ్మా. ఊరికే పన్లతో కొట్టుకుపోతూ వుంటే" అంటుంది.

ఇది చేసే పనులేమిటో? కబుర్లుమాత్రం చెబుతుంది పెద్ద ఆరిందలాగ.

పెళ్ళంటే మాటలా! పిల్లనచ్చాలి కట్నాల దగ్గర బేరం కుదరాలి. వీటన్నిటికీ డబ్బు కుదుర్చుకోవాలి తరవాతగదా?

అప్పుడే దీనికి పెళ్ళెందుకో! మనిషి చూడబోతే నలుసులా యింత వుంటుంది!

---

"పుష్య"

"సీతా! ఎంతసేపే మొహం తోమడం?"

"లేదమ్మా. వచ్చేస్తున్నాను."

"అవతల పాలవాడు పాలు తెచ్చినట్టున్నాడు వెళ్ళి కొలిపించుకో తల్లీ చేతిలో పనుంది."

పక్కింటి దడితలుపు కిర్రుమంది.

"ఏమిటండోయ్ వదినగారూ! ఇవాళంతా పెళ్ళివారులా వుంది సందడి"

"ఏం సందడి తల్లీ! పొద్దుట్నుంచీ ఒక్కలాగ గుండావిండీ అయిపోతున్నాను. నాగుని చూడ్డానికి యివాళొస్తామని కబురుపెట్టారు. మిఠాయి చేస్తేనేగాని వీలులేదని ఆయన పట్టుపట్టుకూర్చున్నారు ఏంచెప్పనమ్మా! మన కాలంలో యిలా వున్నాయా చెప్పండి, ఎంచుకోవడాలు. ఏదో అమ్మా నాన్నా వెళ్ళి చూసేవారు. పెళ్ళి నిశ్చయించేవారు. ఇప్పుడువాళ్ళు ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటేనేగాని వీల్లేదుట."

"నిజమేగా వదినా, కాలంతోపాటు మనుషులూను. ఏంచేస్తాం. అయినా పూర్తిగా అలా కొట్టిపారేయడానికీ వీల్లేదమ్మా. మొన్న చెప్పానుగా. మా సీతను కాకినాడవాళ్ళు చేసుకోడానికి యిష్టపడ్డారని. అతను యింజనీయరు చదువుతున్నాడు. ఆ అబ్బాయి అసలు పిల్లను చూడకుండానే నిశ్చయం చేసేమన్నాట్ట. తరవాత నేనే అన్నాను. ఆ అబ్బాయిని ఓసారి తీసుకురండి. వాళ్ళూ వాళ్ళూ చూసుకుంటే ఏ పూచీ పేచీ వుండదని."

"నిజమేనమ్మా నిజమే! లోకంలో కొందరు అలాంటి గుణవంతులూ వుంటారు. ఇంతకీ మీ సీతకేంలోటని. మాణిక్యంలాంటి పిల్ల. కళ్ళు మూసుకుని పెళ్ళిచేసుకోవచ్చు."

ఇదంతా స్తంభం పక్కనిలుచొని వింటున్న సీత "పాలు యిక్కడ పెడుతున్నాను. పిల్లి తాగేస్తే నాపూచీలేదు" అని ఒక్కవిసురున యింట్లోకి వెళ్ళిపోయింది.

కనకాంబరరంగు పరికిణీ, నెమలిపించంరంగు జాకట్టు, జరీ అంచు తెల్లవాణీ వేసుకుని, నిలువుటద్దంలో సీత తన్నుతాను కలియమాసుకుంది.

నల్లటి కాటుకరంగులో తెల్లటికళ్లు తళుక్కుమన్నాయి.

లోపలిగుమ్మంలో నిలుచొని వీధిలోకి తొంగిచూసింది. వీధి అంతా నిర్జనంగావుంది. పైకి ఎవరూ రాలేదు. సాయంత్రం అయినా ఎండ పెళపెళలాడుతోంది. లోపలికి పోదామనుకుంటూనే, వీధిగుమ్మంలో కాలుపెట్టింది.

పక్కయింటివాళ్ళ అరుగుమీద చిట్టచివర కూర్చొని నాగుచెల్లెలు వేణూ, యింకోపిల్లా కబుర్లుచెప్పుకుంటున్నారు.

"వేణూ! వేణూ! నీతో మాట్లాడేదెవరే?"

"........."

"అబ్బ అదేంక బుర్రో మాటవినిపించుకోకుండా. వేణూ! నిన్నే నే"

"ఎందుకే?"

"ఒక్కమారు యిలారావే. చిన్నమాట"

"ఎందుకో చెబ్దూ?"

"నీతో మాట్లాడేదెవరే?"

"ఎవరా? మావాళ్ళేలే"

మావాళ్ళేలే. వీళ్ళవాళ్ళు కాకపోతే యింకో కరిక్కావాలి దీంతో మాట్లాడ్డానికి! వెధవ విరగబాటు, ఏంచూసుకునో. అదేమిటో ఆ యింట్లో వాళ్ళందరికీ ఒకేరకంజబ్బు...

కమలం ఏం చేస్తోందో. దానికి యిరవై నాలుగ్గంటలూ నిద్రే. అదేం మనిషో.

ఎదురింటి డాబామీద బాగా ముస్తాబైన ఒక విగ్రహం కదిలింది.

అమ్మయ్య! కమలం వచ్చింది. కొంత కాలక్షేపం. అసలు కథేమిటో. టిప్‌టాప్‌గా తయారయింది కమలం. ఎందుకో ఆ హుషారు.

కమలం, నాగరత్నం యింటివేపు వేలు చూపించింది.

సీతకంతా అర్థమయిపోయింది.

మూగభాషలో యిద్దరూ మాట్లాడుకున్నారు.

"పెళ్ళివారెప్పుడొస్తారు?"

"ఇవాళే."

"మరి నీకెప్పుడు?"

చర్రునకోపంవచ్చింది సీతకు. మొహంపక్కకు తిప్పేసుకుంది.

ఛీ! సిగ్గూ లజ్జాలేదు పిల్లకి. నా పెళ్ళిగొడవ దీనికెందుకో. వీళ్ళందరి పెళ్లిళ్ళకన్న గొప్పగానే ఔతుంది నా పెళ్లి. అందరికన్న అందగాడు,

ఎక్కువగా చదువుకున్నవాడు, బాగా డబ్బున్నవాడు వస్తాడు.

నాన్నగారు సావకాశంగా భోంచేస్తూ తనకు కాబోయే అల్లుణ్ణి గూర్చి వర్ణించిన వర్ణనలు మనో నేత్రం ముందు గోచరించేయి.

ఇంజనీరింగు చదువుతున్నాట్ట. ఇంజనీరింగు అంటే మాటలా? ఎంత డబ్బుండాలి. ఎంత తెలివి తేటలుండాలి. మనిషి తెల్లగా దవ్వచుట్టలా వుంటాట్ట. వెడల్పాటి నుదురు, కోలనైనముక్కు, చెయ్యెత్తు మనిషీని.

అసలు సన్నగా, పొడవుగావుంటేనే ఎంతో నాజూగ్గావుంటారు. కరణంగారబ్బాయి కృష్ణారావు కూడా నాజూగ్గానే వుంటాడు. కాని కొంచం నలుపు, ఆ నలుపులోనూ, కళ్ళలోనూ ఏదోకళవుంటుంది అమ్మ.

కళమాట దేవుడెరుగు. ఆ అబ్బాయి కెంత టెక్కు. నేనేకదా కాలేజీలో చదువుతున్నానని కాబోలు. ఎవరికన్న ఎక్కువ చదువో! వాళ్ళ ముసలమ్మముందు మనవడు సంగతి ఎవరేనా ఎత్తితే భయం.

రోజూ సాయంత్రం అయేసరికి టిప్‌టాప్‌గా తయారయి వెళ్లిపోతాడు. అంత ముస్తాబెందుకో.

వెళ్లినవాడు తిన్నగా వెళ్ళాలా! కళ్ళలో కళ్లుపెట్టి సూటిగా చూస్తాడు. ఎవరేనా చూస్తే ఏమనుకుంటారు? ఎందుకో ఆ చూపు. అతనలా చూడ్డంకాదు కాని, అదేమిటో నాకు మతి పోయినట్టుంటుంది.

పోనీ రోజూ వస్తాడుగదా అని అతనికోసం అలా కాచుక్కూచుంటానా, ఒక్కొక్కనాడు ఎంత టెక్కుచేస్తాడు. అసలు యిటువేపే చూడకుండా వెళ్ళిపోతాడు.

మొన్న నతను చేసినపనికి వారంరోజులదాకా చూడకూడ దనిపించింది. పాపం! నిన్న నతనిని చూస్తే ఎంతో జాలేసింది. పిచ్చివాడిలా అయిపోయేడు ఒక్కనాడు చూడకపోగానే.

ఇవాళ యింకా ఏం చేస్తున్నాడో యింటి దగ్గర. వెళ్ళకూడదని భీష్మించుకు కూర్చొని వుంటాడు. ఐనా అంత పంతంకూడదు.

రేపట్నుంచీ నేనుమాత్రం చూస్తానా?

తల్లి కేకవిని లోనికి పరిగెత్తింది. దేముడి కొట్లో దీపంపెట్టి, లక్ష్మీదేవికి దండంపెట్టింది.

చేత్తో వుత్తరం పట్టుకుని వీధి అరుగుమీద చతికిలబడ్డారు నాన్నగారు.

"అదేమండీ అలావున్నారు" అని ఆత్రుతతో సావిత్రమ్మ దీపంపట్టుకుని పెరట్లో కొచ్చింది.

"ఆ, యీ మాత్రం దాటాకు చప్పుళ్ళకే బెదిరిపోతానా, నాసామర్థ్యం ఇంకా తెలీదేమో!"

"ఇంతకీ ఏం జరిగిందేమిటి? ఎక్కణ్నుంచి వొచ్చిందేమిటి ఆ వుత్తరం."

"ఎక్కణ్నుంచయితే మనకేం సంబంధం తెగి పోయినాక."

"ఏమిటోనండి-మీ మాటలు నాకేం అర్థం కావడంలేదు."

"అర్థమయి చేసే పనేముంది. ఇంతకీ వాళ్ళ కిష్టం లేకపోతే, మాకు యిష్టంలేదు అని సూటిగా చెప్పెయ్యాలిగాని, ఇలాంటిరాతలెందుకూ."

"సీత పెళ్ళి సంబంధం గురించేనా మీ రంటున్నది?"

"ఆ. అదే. వాళ్ళబ్బాయి చదువు పూర్తయితేనే గాని పెళ్ళి చేసుకోడట. ఇక్కడ చదువు పూర్తయినాక అమెరికా వెళతాడుట. అంత కాలంవరకూ మనని ఆగమనడం భావ్యంగా వుండదుట. అందుచేత యింకేదయినా సంబంధం చూసుకోవడం మంచిదిట. మంచిలా చెడ్డలూ వీళ్ళనడిగిన దెవరో!"

సావిత్రమ్మ నిలువునా నీరయిపోయింది. పోయిన ప్రాణం తిన్నగా పోలేదు.

తనే అధైర్యపడితే పిల్ల మరీ బెంగపెట్టుకు పోతుందని నిబ్బరంగా అంది.

"మానేస్తే మానీనియ్యండి. మనం మాత్రం వాళ్ళని పట్టుకు పాకులాడతామా? ప్రపంచంలో 'నో' అంటే కోటిమంది ఉన్నారు. ఏదో సాంప్రదాయమైన సంబంధం అనిగాని, వాళ్ళ ఆస్తులుపాస్తులూ చూసికాదు."

"అదేమిటే సీతా! లక్ష్మివారం పూటాను."

"ఛీ! ఈ మాత్రానికేనుటే. తప్పమ్మా. సంజ వేళ కంట తడిపెట్టకూడదు నే నున్నానుగా. నీకు మంచి మొగుణ్ణి ఏరి తేలేకపోతానా!"

కరణంగా రబ్బాయి కళ్ళలో కదిలాడు. తల్లి ఒడిలో తలదూర్చి సీత భోరున ఏడ్చింది. ★